

## నేతల మేత..పేదలకు వాత

జిల్లాలో రేషన్ పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. కూటమి నాయకుల కనుసన్నల్లో రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. ఆహార సలహా సంఘ సమావేశాలు మొక్కుబడిగా జరుగుతున్నాయి.

- 8లో..



## ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం.. స.హ చట్టం

సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం వంటిదని డీఆర్వో చిన ఓబులేశు అన్నారు. స.హ చట్టం 20వ వార్షికోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.

- 8లో..

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
32 /24

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

## న్యూస్‌రీల్

### జూనియర్ చాంబర్ అధ్యక్షుడిగా శబరీనాథ్



శబరీనాథ్ ఫైల్

ఒంగోలు టౌన్: జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ఒంగోలు ఛాప్టర్ అధ్యక్షుడిగా పి.శబరీనాథ్ నాయర్ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా కె.వీరబ్రహ్మం, కోశాధికారిగా జె.శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మాంటిస్సోరి స్కూల్‌లో జూనియర్ చాంబర్ వార్షిక సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో 2026వ సంవత్సరానికి గాను నూతన కమిటీని ఎన్నుకున్నారు. కోనంకి వరుణ్ కుమార్, పి.రామాంజనేయులు, ఏడుకొండలు, శ్రీరాములు రెడ్డి, నాగేశ్వరరావు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. సమావేశంలో జేసీఐ పూర్వాధ్యక్షులు టి.రవికుమార్, కనకారావు, అద్దంకి శ్రీనివాసరావు, వివి రమణ, ఇస్మాయిల్, ఈపూరి శివప్రసాద్, ఆంద్ర శ్రీనివాసరావు, జాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో పాల్గొన్న విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఒంగోలు మంగమూరు రోడ్డులో బైపాస్ వద్ద ఉన్న సంఘ జిల్లా కార్యాలయంలో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రతి నెలా ఒక నియోజకవర్గంలో జిల్లా కమిటీ, స్థానిక సంఘీయులతో చర్చించి స్థానిక సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షుడు చెరిగిచర్ల ప్రకాష్, జిల్లా అధ్యక్షుడు పులివర్తి సాయిబాబా, కార్యదర్శి నాగేంద్ర, కోశాధికారి పావులూరు బ్రాహ్మణచారి, కీనల శ్రీనివాసచారి, సన్నమూరి వీరబ్రహ్మం, పదిరి ఆదినారాయణ, చెరుకూరి ఓంకార చారి, పచ్చవ సుబ్రహ్మణ్యం, వేల్పూరి రామారావు, రాచకుళ్ళ రవికుమార్, పోతులూరి వీరబ్రహ్మం, మునిగంటి వెంకటేశ్వరచారి, పోతులూరి శివ, బ్రహ్మాచారి, మునగంటి విశ్వరూపచారి, అలుగుపల్లి శ్రీనివాసచారి, గోనుగుంట దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణజలం.. విషతుల్యం

కూటమి నేతలు ధనార్జనే ధ్యేయంగా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. లక్షలాది మందికి నీటి సరఫరా చేసే విషయంలో కాసులకు కక్కుర్తి పడి కలుషిత జలాలతో జనాలను అనారోగ్యం పాలుచేస్తున్నారు. రక్షిత మంచి నీరు బదులు మురుగునీటిని సరఫరా చేస్తున్నా అటు పాలకులు, ఇటు అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- ఫిల్టర్ చేయకుండా నేరుగా తరలిస్తున్న సాగర్ జలాలు
- దుర్వాసన వెదజల్లుతున్న తాగునీరు
- బ్లీచింగ్ కూడా వేయకుండానే సరఫరా
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- దర్శి ఎస్ఎస్ ట్యాంకు ద్వారా నాలుగు మండలాలకు నీటి సరఫరా
- కనీస నిబంధనలు పాటించని కాంట్రాక్టర్



ఫిల్టర్ చేయకుండా నేరుగా క్లియర్ వాటర్‌ట్యాంక్‌లోకి నీటిని వదలడంతో మురికిగా ఉన్న తాగు నీరు



ఎన్ఎపీ రిజర్వాయర్

దర్శి:

దర్శి పట్టణం నుంచి దర్శి, పొదిలి, తాళ్లూరు, ముండ్లమూరు మండలాలకు చెందిన ప్రజలకు నిత్యం సాగర్ జలాలు సరఫరా చేసేందుకు నాలుగున్నర దశాబ్దాల కిందట ఎన్ఏపీ (నెదర్లాండ్ ఎయిడెడ్ ప్రాజెక్ట్) సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును నిర్మించారు. ఈ ప్రాంతంలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉండడంతో అప్పట్లో రూ.4 కోట్ల వ్యయంతో దీనిని నిర్మించారు. సాగర్ కాలువ నుంచి వచ్చే జలాలను స్టోరేజ్ ట్యాంకుకు మోటార్ల ద్వారా సరఫరా చేసి వాటిని శుద్ధి చేసి నియోజకవర్గంలో ప్రజలకు తాగునీరు అందించేలా ప్రణాళికలు చేశారు. ప్రారంభంలో దీని ద్వారా దర్శి, కనిగిరి, పొదిలి ప్రాంతాలకు నిత్యం రెండు లక్షల మందికి తాగునీరు అందించేవారు. 930 మీటర్ల మట్టి కట్టతో 2538 మిలియన్ లీటర్ల పరిమాణం కలిగిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో నీటిని శుద్ధి చేసేందుకు 7 శాండ్ ఫిల్టర్ బెడ్‌లు ఏర్పాటు చేశారు. 5 లక్షల లీటర్ల నీటి పరిమాణం కలిగిన క్లియర్ వాటర్ స్టోరేజ్ ట్యాంక్‌ను కూడా నిర్మించారు. ఫిల్టర్ బెడ్‌లలో శుద్ధి చేసిన జలాలను నేరుగా క్లియర్ వాటర్ ట్యాంక్‌లకు సరఫరా చేయాల్సి ఉంటుంది. ప్రారంభంలో దర్శి, పొదిలి, తాళ్లూరు, ముండ్లమూరు మండలాలకు నీటిని పంపేవారు. తర్వాత మర్రిపూడి, కనిగిరి మండలాలకు సైతం నీటిని సరఫరా చేశారు. ఈ నీటిని సరఫరా చేసేందుకు టెండర్లు నిర్వహించేవారు. కాంట్రాక్టు పొందిన వ్యక్తి నీటిని క్రమం తప్పకుండా శుద్ధి చేసి పంపిణీ చేయాల్సి ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నీటి సరఫరా అంతా సక్రమంగా జరిగింది. రోజు విడిచి రోజు నీటిని పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. అంతేకాకుండా నీటి శుద్ధి చేయకుండా సరఫరా చేస్తున్నారు.

సాగర్ కాలువ కట్టపై ఉన్న డంపింగ్ మురుగు వర్షాలకు సాగర్ కాలువలోకి చేరుతోంది. ఆ నీటినే నేరుగా మంచినీటి రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తున్నానని, ఆ నీటిని కనీసం శుద్ధి చేయకుండా అలాగే నేరుగా క్లియర్ వాటర్ ట్యాంక్‌కు సరఫరా అవుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫిల్టర్ చేయకుండా నేరుగా నీటిని సరఫరా చేస్తూ తమ ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఎక్కువ మొత్తంలో డబ్బులు పెట్టి మినరల్ వాటర్ కొనుగోలు చేయలేక సాగర్ జలాలు వాసన వస్తున్నా గత్యంతరం లేక ఆ నీటిని తాగాల్సి వస్తోందని వాపోతున్నారు.

### టెండర్ల దశలోనే తిరకాసు..

గత ప్రభుత్వంలో ఈ నీటిని శుద్ధి చేసి సరఫరా చేసేందుకు టెండర్లు పిలిచి కాంట్రాక్టరు ద్వారా నీటిని సరఫరా చేసే వారు. నీటి పంపిణీకి సంబంధించి దర్శి, ముండ్లమూరు, తాళ్లూరులకు విడివిడిగా టెండర్లు పిలిచేవారు. దర్శికి సంబంధించి రూ.2 కోట్లు, తాళ్లూరు మండలానికి రూ.76.5 లక్షలు, ముండ్లమూరు మండలానికి రూ.98 లక్షలు చెల్లించేలా టెండర్లను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పిలిచేవారు. మొత్తంగా రూ.3.735 కోట్లకు సంబంధించిన టెండర్లను వైఎస్సార్ సీపీ హయాంలో 30 శాతం తక్కువకు టెండర్ వేసేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉన్నంత వరకూ నీటిని శుద్ధి చేస్తూ రోజు విడిచి రోజు నీటిని అందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. టెండర్ల దశలో అంతా గోల్‌మాల్ జరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఎవరూ పోటీకి రాకుండా అధికార పార్టీకి చెందిన వ్యక్తి కేవలం ఒక శాతం తక్కువ కోడ్ చేసి దక్కించుకున్నాడని ఆరోపణలు వినిపించాయి. అయితే తాను చేసే పనిలో అధిక మొత్తంలో అధికార పార్టీకి చెందిన కీలక ప్రజాప్రతినిధికి భారీగా నజరానా చెల్లించాడని సమాచారం. కాంట్రాక్ట్ దక్కించుకున్న వ్యక్తి నీటి సరఫరాకు సంబంధించి కనీస నిబంధనలు పాటించడంలేదని తెలుస్తోంది. నీటిని శుద్ధి చేయడంలేదని, కనీసం బ్లీచింగ్ కూడా వేయకుండా అలాగే సాగర్ జలాలు గ్రామాలకు మురుగు నీరుగా సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం పురుగులను నిర్మూలించేందుకు గ్యాస్ లేదా బ్లీచింగ్ కూడా నీటిలో కలుపకుండా అలాగే సరఫరా చేయడంతో అందులో పురుగులు కూడా వస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. మట్టి మట్టిగా నీరు రావడమే కాకుండా దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. నిండుగా నీరున్నా వారానికి రెండు రోజులు మాత్రమే సరఫరా చేస్తున్నారు. ఫలితంగా తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కలుషిత నీరు వస్తున్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### ప్రతి రోజు నీరు సరఫరా చేయడం లేదు



ప్రతిరోజు నీరు సరఫరా చేయడం లేదు. వారంలో రెండు రోజులు మాత్రమే నీరు వస్తోంది. నీరు కూడా మురికిగా వస్తోంది. పురుగులు ఉంటున్నాయి. మాలాంటి పేదలు ఆ నీటిని ఎలా తాగాలి. నీటిని శుద్ధి చేసి అందివ్వాలి. ఈ నీళ్లు తాగి రోగాల బారిన పడుతామని భయం వేస్తోంది.

– వల్లపు గురులక్ష్మి, శివరాజనగర్

### నీళ్లు వాసన వస్తున్నాయి



కొళాయిల్లో నీరు మురికిగా వస్తున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో ఆ నీటిని అలాగే తాగుతున్నాం. పురుగులు కూడా వస్తున్నాయి. వారంలో రెండు రోజులే నీరు వదులుతున్నారు. శుద్ధి చేసిన నీటిని వదలాలి. కనీసం బ్లీచింగ్ కూడా నీటిలో వేయడం లేదు. చిన్న చిన్న పురుగులు నీటిలో కనిపిస్తున్నాయి. వడగట్టుకుని తాగాల్సి వస్తోంది.

– తమ్మిశెట్టి కొండమ్మ, శివరాజనగర్



నీటిశుద్ధి కేంద్రం వద్ద పక్కన పడేసిన నీటి శుద్ధి గ్యాస్ బండలు



ఫిల్టర్ బెడ్‌లలోకి వెళ్తున్న రిజర్వాయర్ లో సాగర్ జలాలు



సాగర్ జలాలతో నింపిన రిజర్వాయర్

# అధికారులా.. రౌడీలా?

- బోగస్ ఇంటి పట్టాలు అంటూ దౌర్జన్యంగా నిర్మాణాలు కూలగొట్టించారు
- గిరిజనుల ఇంటి స్థలాలపై కన్నేసిన పచ్చనేతలు
- కూటమి ప్రభుత్వంలో రాజ్యమేలుతున్న దొంగలు
- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ధ్వజం



ఎమ్మెల్యే తాటిపర్తి ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న చెంచు గిరిజనులు

యర్రగొండపాలెం: రెవెన్యూ అధికారులు రౌడీల్లా వ్యవహరిస్తున్నారని, బోగస్ ఇంటి స్థల పట్టాలని చెప్పి నిర్మాణాల్లో ఉన్న గృహాలను వారు దౌర్జన్యంగా కూలగొట్టించారని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ఆరోపించారు. స్థానిక కొప్పుకొండకు సమీపంలో ఉన్న వెంకటగిరి కాలనీలో గుడిసెలు, నిర్మాణంలో ఉన్న ఇంటి గోడలు, నీటి తొట్లు కూల్చివేయించారని ఆ ప్రాంతం గిరిజనులు చేసిన ఆరోపణలపై ఎమ్మెల్యే స్పందించి ఆదివారం ఆ ప్రాంతానికి వెళ్లి ఆ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1997, 2008 సంవత్సరాల్లో ప్రభుత్వం చెంచు గిరిజనులకు ఇచ్చిన ఇంటి పట్టాలు బోగస్ పట్టాలని తహసీల్దార్ కూలకొట్టించడం వెనుక టీడీపీ నేతల హస్తం ఉందని ఆయన ఆరోపించారు. గతంలో పట్టాలు ఇచ్చిన తహసీల్దార్లు బోగస్ పట్టాలు మంజూరు చేశారా అని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం ఉన్న తహసీల్దార్ అవి బోగస్ పట్టాలని ఏ విధంగా నిర్ధారించారని, చెంచు గిరిజనులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా అక్కడ ఉన్న నిర్మాణాలను కూలగొట్టించడం హేయమైన చర్యఅని ఆయన అన్నారు. కొంతమంది టీడీపీ నాయకులు ఆ స్థలాలపై కన్నేసి, వాటిని కాజేయటానికి వేసిన పన్నాగాన్ని అధికారులు సమర్థించి వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో దొంగలు రాజ్యమేలుతున్నారని, ఈ ప్రభుత్వం పేదలకు గృహాలు నిర్మించి ఇవ్వలేకపోయినా.. సొంతంగా నిర్మించుకుంటున్న గృహాలను కూల్చివేయిస్తోందని మండిపడ్డారు. ఆ ప్రాంతంలో గిరిజనులకు ఇంటి పట్టాలు ఇవ్వకుంటే రూ.1.80 కోట్లతో ఐటీడీఏ నిధులు ఖర్చుపెట్టి తారు రోడ్డు ఎందుకు వేయించిందని, తాగు నీటి కోసం బోరు ఏ విధంగా వేయించారని ఆయన అధికారులను ప్రశ్నించారు. ఆ ప్రాంతంలో గిరిజన కాలనీలు ఉన్నాయన్న ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం ఐటీడీఏ నిధులను కేటాయించిన విషయాన్ని అధికారులు పరిగణలోకి తీసుకోకుండా టీడీపీ నాయకులు చెప్పిందే వేదంగా వ్యవహరిస్తున్నారని, గిరిజనులు గృహ నిర్మాణాలు చేయనీయకుండా గిరిజనులను రోడ్డున పడేస్తున్నారని అన్నారు. ఈ సంఘటనపై కలెక్టర్, ఎస్పీల దృష్టికి తీసుకెళ్తామని, గిరిజనులకు తమ పార్టీ అండగా నిలుస్తుందని, వారికి న్యాయం జరిగే వరకు ఆందోళన చేస్తామని ఆయన అన్నారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, మండల కన్వీనర్ ఏకుల ముసలారెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, వివిధ విభాగాల నాయకులు సయ్యద్ జబీవుల్లా, కందూరి కాశీవిశ్వనాథ్, ఆవుల కోటిరెడ్డి, బి.బాలచెన్నయ్య ఉన్నారు.

# బస్సుల్లో ఎక్కించుకోవాలని భక్తుల ఆందోళన



భక్తులు అడ్డుకున్న అద్దంకి డిపో బస్సు

- రెండు రోజులుగా మండల కేంద్రంలో ప్రయాణికుల రద్దీ

పెద్దదోర్నాల: శ్రీశైలం వెళ్లే బస్సుల్లో తమను ఎక్కించుకోవాలంటూ పలువురు భక్తులు ఆర్టీసీ బస్సుల ఎదుట ఆందోళన నిర్వహించి ఆర్టీసీ బస్సులను నిలువరించారు. ఈ సంఘటన ఆదివారం రాత్రి పెద్దదోర్నాల ఆర్టీసీ బస్టాండులో చోటు చేసుకుంది. వివరాల మేరకు రెండవ శనివారం, ఆదివారం రెండు రోజులు సెలవు దినాలు కావటంతో మండల కేంద్రంలో శ్రీశైలం వెళ్లే యాత్రికులతో రద్దీ నెలకొంది. దీంతో శ్రీశైలం వెళ్లే పలు వాహనాలు యాత్రికుల రద్దీతో కిటకిటలాడాయి. ఈ నేపథ్యంలో ఆదివారం మండల కేంద్రంలో రద్దీ ఎక్కువ కావటంతో శ్రీశైలం వెళ్లే ప్రతి బస్సు వద్ద యాత్రికులు ఎగబడ్డారు. అయితే ప్రయాణికులకు సరిపడినన్ని బస్సులు ఏర్పాటు చేయలేదు. దీనికి తోడు ఘాట్ రోడ్‌లలో పరిమితికి లోబడి ప్రయాణికులతో వెళ్లాలన్న నిబంధనలు ఉండటంతో కొంత మంది ఆర్టీసీ సిబ్బంది అధిక లోడు ప్రయాణికులతో వెళ్లేందుకు నిరాకరించారు. దీంతో తాము మూడు గంటల నుంచి బస్సుల కోసం కాసుకుని ఉన్నా తమను బస్సుల్లో ఎక్కించుకోలేదని కొందరు ప్రయాణికులు ఆందోళన నిర్వహించి బస్సుల రాకపోకలను అడ్డుకున్నారు. దీంతో స్పందించిన ఆర్టీసీ కంట్రోలర్‌లు భక్తులకు నచ్చచెప్పి ప్రతి బస్సులో కొందరు ప్రయాణికులు ఎక్కేందుకు అవకాశం కల్పించటంతో గొడవ సద్దుమణిగింది.

# సండే సందడి



చెరువు తూము వద్ద స్నానం చేస్తున్న సందర్శకులు



చెరువుకట్టపై సందర్శకుల కోలాహలం

### కంభం చెరువుపై సందర్శకుల తాకిడి

కంభం: చారిత్రక కంభం చెరువు కట్టపై ఆదివారం సందర్శకులతో కోలాహలం నెలకొంది. ఇటీవల కురిసిన వర్షానికి కంభం చెరువులో భారీగా జలకళ సంతరించుకోవడంతో సందర్శకుల తాకిడి పెరిగింది. ఆదివారం చుట్టుపక్కల గ్రామాల నుంచి పలువురు కుటుంబ సమేతంగా చెరువుకట్టకు చేరుకొని అక్కడే భోజనాలు చేసి సరదాగా గడిపారు. చిన్నకంభం తూమువద్ద ఉన్న కాలువలో ఈతకొడుతూ సేద తీరారు. కట్టపైన ఉన్న దీనాపావళి దర్గా, వరదరాజమ్మ ఆలయం వద్ద పలువురు ప్రార్థనలు నిర్వహించారు.



కళకళలాడుతున్న కంభం చెరువు

## క్లుప్తంగా

### ఈతకు వెళ్లి యువకుడు మృతి


మృతుడు గుమ్మడి సన్నీ

**తాళ్లూరు:** ఈతకు వెళ్లి యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని శివరాంపురం గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు. గుమ్మడి ముత్యాలు, సుజాత కుమారుడు గుమ్మడి సన్నీ (20 ) ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం కావడంతో గ్రామంలోని కొంత మంది యువకులతో కలిసి పెద్దసాగర్ కాలువలో ఈత కొట్టేందుకు వెళ్లారు. ఈత కొడుతున్న సమయంలో సన్నీ నీటిలో మునిగి మృతి చెందాడు. మృతునికి ఏడాదిన్నర క్రితమే వివాహమైంది. దీంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

### దాడి కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

**సింగరాయకొండ:** దాడి కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు. వివరాల్లోకి వెళితే..మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ విద్యానగర్ 3వ లైనులో నివసిస్తున్న కొల్లా వినయ్‌పై ఈ నెల 10వ తేదీ శుక్రవారం ఊళ్లపాలెంకు చెందిన కొల్లా సాయి చరణ్, జరుగుమల్లి మండలం సతుకుపాడు గ్రామానికి చెందిన బల్లికుర సుమంత్ దాడి చేశారు. బాధితుడు వినయ్ ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో ఇద్దరు నిందితులను శనివారం సాయంత్రం కందుకూరు ఫ్లైఓవర్ వద్ద అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచినట్లు ఎస్సై పేర్కొన్నారు.

### 20 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత.?

**ఒంగోలు టౌన్:** నగరంలోని బైపాస్ రోడ్డులో డంపింగ్ యార్డు వద్ద అనధికారికంగా ఇసుక విక్రయిస్తున్న 20 ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. ప్రభుత్వం లైసెన్స్ మంజూరు చేసిన వ్యక్తిని కాదని అనధికారికంగా ఇసుక విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. దాంతో ప్రభుత్వం మంజూరు చేసిన లైసెన్స్ రద్దు చేయాలని ఫ్యూచర్ ట్రేడ్స్‌కు చెందిన భరత్ ఇటీవల మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేయడంతో ఇసుక అక్రమ విక్రయాల వ్యవహారం బట్టబయలైంది. దీంతో పోలీసులు రంగంలోకి దిగి నగరంలో అనధికారికంగా ఇసుక విక్రయిస్తున్న 20 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయాన్ని ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్ సీఐ విజయకృష్ణ నిర్ధారించకపోవడం గమనార్హం.

# నేతల మేత.. పేదలకు వాత..!

- జిల్లాలో అస్తవ్యస్తంగా రేషన్ పంపిణీ వ్యవస్థ
- కూటమి నాయకుల కనుసన్నల్లో పక్కదారి పడుతున్న రేషన్ బియ్యం
- బియ్యంకు బదులు కిలోకు రూ.10 ఇస్తామంటున్న డీలర్లు
- తమ సమస్యలు పట్టించుకునేవారు లేరంటున్న కార్డుదారులు
- మొక్కుబడిగా ఆహార సలహా సంఘ సమావేశాలు

మార్కాపురం:

జిల్లాలో రేషన్ పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కూటమి ప్రభుత్వంలో ఆయా పార్టీల నాయకులు, మద్దతుదారులే రేషన్ డీలర్లుగా అవతారమెత్తి రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించి స్వాహా చేస్తున్నారు. కార్డుదారులకు సక్రమంగా రేషన్ పంపిణీ జరగక లబోదిబోమంటున్నారు. జిల్లాలో యథేచ్ఛగా రేషన్ బియ్యం అక్రమ రవాణా సాగుతోంది. ఇటీవల నాగులుప్పలపాడు, పొన్నలూరు, మార్కాపురం ప్రాంతాల్లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కొన్ని కేసులు మాత్రమే నమోదు చేసి బయటకు తెలుస్తుండగా, జిల్లావ్యాప్తంగా గుట్టుచప్పుడు కాకుండా విచ్చలవిడిగా రేషన్ దందా సాగుతోంది. రేషన్ కార్డుదారుల సమస్యలు పరిష్కరించడంతో పాటు రేషన్ పంపిణీ వ్యవస్థను సక్రమంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన ఆహార సలహా సంఘ సమావేశాలు మొక్కుబడిగా సాగుతుండటంతో అక్రమార్కులు రోజురోజుకూ చెలరేగిపోతున్నారు. క్షేత్రస్థాయిలో తెల్ల రేషన్ కార్డుదారులు ఎదుర్కొంటున్న సమస్యలు అధికారుల దృష్టికి వెళ్లడం లేదు. ఒకవేళ వెళ్లినా.. పట్టించుకునేవారు లేకపోవడంతో కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**జిల్లాలో 6,37,820 రేషన్‌కార్డులు, 1,392 రేషన్ దుకాణాలు...**

జిల్లాలో రేషన్ పంపిణీ ఒక ప్రహసనంలా మారింది. బియ్యానికి బదులుగా కిలోకు 10 రూపాయల డబ్బులిస్తామని, తీసుకుంటే తీసుకోండి.. లేదంటే లేదంటూ బాహాటంగానే రేషన్ డీలర్లు చెబుతున్నా పట్టించుకునే అధికారులు లేరు. ఎక్కడైనా రేషన్ బియ్యం పట్టుబడితే తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే అధికారులు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇలాంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు నిర్వహించాల్సిన ఆహార సలహా సంఘ సమావేశాలు జిల్లాలో నాలుగైదు చోట్ల మాత్రమే మొక్కుబడిగా సాగాయి. టంగుటూరు, కంభం, గిద్దలూరు, ఒంగోలు తదితర ప్రాంతాల్లో ఈ సమావేశాలు నిర్వహించగా, మిగిలిన చోట వీటి ఊసే లేదు. గత నెల 16న ప్రభుత్వం (వినియోగదారుల కమిషన్) సమావేశాలు నిర్వహించాలని చెప్పడంతో మొక్కుబడిగా నిర్వహించారు. జిల్లాలో మొత్తం 6,37,820 రేషన్‌కార్డులు ఉండగా, 1392 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ప్రతి నెలా సుమారు 10,582 మెట్రిక్ టన్నుల బియ్యం జిల్లాకు వస్తోంది. కానీ, పేదలకు సక్రమంగా అందకుండా కూటమి నాయకులు స్వాహా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.


రేషన్ షాపులో కాటా వేస్తున్న బియ్యం

**మొక్కుబడిగా సమావేశాలు...**

జిల్లా వ్యాప్తంగా ఆహార సలహా సంఘాలు పూర్తిస్థాయిలో పనిచేయకపోవటంతో సమావేశాలు మొక్కుబడిగా జరుగుతున్నాయి. సక్రమంగా సమావేశాలు నిర్వహించకపోవటంతో వినియోగదారులకు అందాల్సిన నిత్యావసర వస్తువులు సక్రమంగా అందడం లేదు. అధికారులను ప్రశ్నించే కమిటీ లేకపోవటంతో నిత్యావసర వస్తువుల పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ప్రస్తుతం రేషన్‌దుకాణాలు అలంకారప్రాయంగా మిగిలాయి. గతంలో బియ్యం, చక్కెర, కిరోసిన్, గోధుమలు, కందిపప్పు, నూనె, గోధుమపిండి, ఉప్పు ఇచ్చేవారు. ఇప్పుడు కేవలం బియ్యం, చక్కెరకు మాత్రమే పరిమితమయ్యాయి.

**కమిటీ ఇలా...**

ఆహార సలహా సంఘ కమిటీలో ఆర్డీఓ, తహసీల్దార్, ఒక డీలర్, ప్రింట్ మీడియా సభ్యుడు, ఎంపీడీఓ, నాలుగు ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలకు చెందిన వ్యక్తులు ఉంటారు. వీరందరూ నెలవారీగా సమావేశాలు నిర్వహించి కార్డుదారుల ఇబ్బందులు, తదితర అంశాలపై చర్చించి ప్రత్యేక రిజిష్టర్ తయారు చేయాల్సి ఉంటుంది. పౌరసరఫరా గోడౌన్ నుంచి రేషన్ దుకాణాలకు వచ్చే సరుకుల వివరాలపై సభ్యులకు పూర్తి స్థాయిలో సమాచారం ఉండాలి. కానీ, కమిటీల సమావేశం జరగకపోవడంతో సమస్యలు అధికారుల దృష్టికి పోవటం లేదు. రేషన్ బియ్యం పలు చోట్ల పక్కదారి పడుతోంది. మార్కాపురం, తర్లుపాడు, మర్రిపూడి మండలాల్లో కొంతమంది రేషన్ డీలర్లు బాహాటంగానే బియ్యం బదులుగా కిలోకు 10 రూపాయలు డబ్బులిస్తామని చెబుతున్నారు.

**కమిషన్ ఆదేశాలు పట్టించుకోవడం లేదు**



జిల్లాలో ఆహార సలహా సంఘ సమావేశాలను గత నెల 16వ తేదీ నిర్వహించాలని కమిషన్ ఆదేశించింది. అక్కడక్కడా మాత్రమే కొంతమంది తహసీల్దార్లు నిర్వహించారు. అవి కూడా మొక్కుబడిగా సాగాయి. కొన్నిచోట్ల డిప్యూటీ తహసీల్దార్లే ఈ సమావేశాలు పెట్టారు. వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలంటే సమావేశాలు నిర్వహించడం లేదు. దీనివలన ప్రభుత్వం దృష్టికి కార్డుదారుల సమస్యలు వెళ్లడం లేదు. రేషన్ దుకాణాలు, పెట్రోల్ బంకులను కమిటీ సభ్యులతో కలిసి అధికారులు తనిఖీ చేయాలని ఆదేశాలిచ్చినప్పటికీ అమలు కావడం లేదు. ఇప్పటికైనా సమావేశాలు నిర్వహించి రేషన్ కార్డుదారుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి.

– ఓపి మల్లిక్, జిల్లా వినియోగదారుల సమాఖ్య గౌరవాధ్యక్షుడు

# ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం.. సమాచార హక్కు చట్టం

- ర్యాలీలో డీఆర్‌ఓ ఓబులేసు

**ఒంగోలు సబర్బన్:** సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం వంటిదని జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు అన్నారు. సమాచార హక్కు చట్టం 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఒంగోలులో ర్యాలీ, సమావేశం నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టర్ కార్యాలయం నుంచి నెల్లూరు బస్టాండ్ మీదుగా చర్చి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు మాట్లాడుతూ సమాచర హక్కు చట్టం అమల్లోకి వచ్చి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో ర్యాలీ, సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ చట్టం ద్వారా ప్రజలడిగిన సమాచారాన్ని అధికారులు అందించాలన్నారు. ప్రజలు సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకుని అవసరమైన సమాచారాన్ని పొందవచ్చని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం విజయవాడలోని ప్రధాన సమాచార కార్యాలయం వర్చువల్‌గా కూడా విచారణ నిర్వహిస్తోందని, ఇది ఎంతో ఉపయోగకరమని అన్నారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీఓ కళావతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విజయజ్యోతి, జిల్లా విద్యా శాఖాధికారి కిరణ్ కుమార్, ఒంగోలు అర్బన్ తహసీల్దార్ పిన్నిక మధుసూదనరావు, ఒంగోలు రూరల్ డిప్యూటీ తహసీల్దార్ కుట్టుబోయిన అశోక్ కుమార్, రూరల్ ఆర్‌ఐ శ్రీకంత శ్రీనివాసరావు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న డీఆర్‌ఓ ఓబులేసు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది

### ఫిల్టర్ బెడ్ సంపులో జారిపడి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి


సంపులో శ్రీనివాస్ మృతదేహం

**ఒంగోలు టౌన్:** నగర పాలక సంస్థలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి నగరంలోని ఒక మంచినీటి సంపులో జారిపడి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం... స్థానిక చెరువుకొమ్ముపాలేనికి చెందిన సీతారాం శ్రీనివాస్ (30) నగరపాలక సంస్థలోని ఇంజినీరింగ్ విభాగంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గతంలో చెరువుకొమ్ముపాలెంలో ఐదేళ్లపాటు పనిచేసిన శ్రీనివాస్.. ఆరు నెలల కిత్రం ఒంగోలు వచ్చి నగరంలోని బాలాజీరావుపేట ఫిల్టర్ బెడ్స్‌లో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. శనివారం రాత్రి 12 గంటల సమయం తర్వాత నైట్ డ్యూటీలో వుండగా పొరపాటున సంపులో జారిపడి ఈత రాకపోవడంతో నీటిలో మునిగి చనిపోయాడు. ఆదివారం ఉదయం మృతదేహం నీటిపై తేలియాడుతుండడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే రంగంలోకి దిగిన ఒంగోలు వన్‌టౌన్ పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### అడ్మిషన్ల కోసం టాలెంట్ టెస్ట్‌లు నిలిపివేయాలి

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నారాయణ విద్యా సంస్థ వద్ద ధర్నా


నారాయణ విద్యాసంస్థ వద్ద ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు

**ఒంగోలు సిటీ:** నారాయణ విద్యాసంస్థల్లో అడ్మిషన్ల కోసం టాలెంట్ టెస్ట్‌లు నిర్వహించడం నిలిపివేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకుడు సీహెచ్ వినోద్ డిమాండ్ చేశారు. ఒంగోలులోని నారాయణ విద్యా సంస్థ వద్ద ఆదివారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ధర్నా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి బండి వీరాస్వామి అధ్యక్షత వహించగా, వినోద్ మాట్లాడుతూ నారాయణ విద్యాసంస్థల పట్ల విద్యాశాఖ పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. నారాయణను మంత్రి పదవి నుంచి బర్త్‌రఫ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్ చేస్తుందన్నారు. నారాయణ విద్యాసంస్థ అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా టాలెంట్ టెస్ట్ పేరుతో విద్యార్థుల వద్ద నుంచి రూ.100 వసూలు చేసి గెలుపొందిన విద్యార్థికి కోటి రూపాయలు ఇస్తామని ప్రచారం చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉన్న మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖామంత్రి నారాయణ నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్ల కోసం ఈ విధమైన టాలెంట్ టెస్టులు నిర్వహించడం సిగ్గుచేటని అన్నారు. పేద విద్యార్థుల పట్ల నారాయణ విద్యాసంస్థలకు నిజంగా ప్రేమ ఉంటే ఆ విద్యాసంస్థల్లో 10 శాతం సీట్లు ఉచితంగా పేదలకు కేటాయించి నిజాయితీ నిరూపించుకోవాలన్నారు. మళ్లీ టాలెంట్ టెస్ట్‌లు నిర్వహిస్తే తప్పనిసరిగా అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు విజయ్, పాండురంగారావు, సాయి, గంగాంజీ కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

### పట్టపగలు చోరీ

- బంగారం, వెండి, నగదు అపహరణ

**సంతమాగులూరు (అద్దంకి రూరల్):** తాళం వేసిన ఇంటిలోకి దొంగలు ప్రవేశించి బంగారం వెండి, నగదు దొంగిలించిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలంలోని కుందుర్రులో జరిగింది. సంతమాగులూరు ఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. కందుర్రు గ్రామంలో ఎస్‌కే ఖాశింసైదా కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళాలు వేసి పనిమీద బయటకు వెళ్లారు. ఆ సమయంలో గుర్తుతెలియని వారింటి తాళాలు పగులగొట్టి బీరువా తెరిచి రూ.20 వేల నగదు, సవర బంగారం, 35 తులాల వెండి వస్తువులు అపహరించారు. ఇంటికి వచ్చిన ఖాశింసైదా దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కేసు నమోదు చేశారు.

### వీఆర్‌కు పొదిలి సీఐ వెంకటేశ్వర్లు

**ఒంగోలు టౌన్:** పొదిలి సీఐ వెంకటేశ్వరరావును వీఆర్‌కు పంపించారు. ఆ మేరకు ఐజీ కార్యాలయం నుంచి ఆదివారం ఉత్తర్వులు వచ్చాయి. ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న యు.రాజేష్‌ను నియమించారు. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో రాజేష్ బాధ్యతలు స్వీకరించారు. రాజేష్ గతంలో జిల్లాలోని పామూరు, కంభం సీఐగా పనిచేసి ఉన్నారు. పొదిలి సీఐ వెంకటేశ్వరరావు మీద పలు ఆరోపణలు ఉన్నట్లు సమాచారం.


బాధ్యతలు చేపడుతున్న సీఐ రాజేష్

# విషాదం నింపిన విహారం


ఒడ్డుకు చేరిన మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు


మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్పీ ఉమామహేశ్వర్


సంఘటన స్థలంలో పరిస్థితిని సమీక్షిస్తున్న ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు

- కన్నీటి సంద్రంగా మారిన తీరం
- వేర్వేరు ఘటనల్లో ఐదుగురు గల్లంతు
- ముగ్గురి మృతదేహాలు లభ్యం
- జాడలేని మరో ఇద్దరి కోసం గాలింపు
- చీరాల రూరల్ మండలం వాడరేవు సముద్రతీరంలో ఘటన
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్

చీరాల:

వారంతా వేర్వేరు ప్రాంతాలకు చెందిన వారు కాగా బీటెక్ చదివేందుకు ఒకే కాలేజీలో చేరారు. మంచి స్నేహితులయ్యారు. ఆదివారం సెలవు రోజు కావడంతో సరదాగా సముద్రతీరంలో స్నానం చేస్తూ ఆనందంతో కేరింతలు కొడుతూ లోతును అంచనా వేయకలేకపోయారు. నిమిషాల వ్యవధిలోనే గల్లంతయ్యారు. స్థానికులు గమనించి నలుగురిని ఒడ్డుకు చేర్చినా మిగిలిన ముగ్గురు కడలిలో కలిసిపోయారు. మరో సంఘటనలో సరదాగా సాగర తీరానికి వచ్చిన వారిలో ఇద్దరు విద్యార్థులు గల్లంతయ్యారు. ఈ రెండు ఘటనల్లో ఐదుగురు విద్యార్థులు కడలి కెరటాలకు బలికావడంతో తీవ్ర విషాదం నెలకొంది. పూర్తి వివరాల్లోకి వెళితే...

అమరావతిలోని విట్ ఇంజినీరింగ్ కాలేజీలో ఎంటెక్ చదువుతున్న ఏడుగురు స్నేహితులు ఆదివారం సెలవు దినం కావడంతో సరదాగా గడిపేందుకు బాపట్ల జిల్లాలోని చీరాల రూరల్ మండలం వాడరేవు సముద్ర తీరానికి వచ్చారు. అలల ధాటిని కూడా లెక్క చేయకుండా సముద్రంలో కేరింతలు కొట్టారు. కొద్దిసేపటికి అలలు ఎక్కువగా రావడంతో ఏడుగురూ గల్లంతయ్యారు. స్థానిక మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్లు గమనించి నలుగురు విద్యార్థులను బయటకు తీసుకువచ్చారు. అయితే, వారిలో ఎంటెక్ చదువుతున్న సాయి మణిదీప్ (జడ్చర్ల), జీవన్ సాత్విక్ (హైదరాబాద్), శ్రీసాకేత్ (హైదరాబాద్) సముద్రంలో గల్లంతయ్యారు. కొంత సమయం తర్వాత ముగ్గురి మృతదేహాలు తీరానికి చేరాయి. అప్పటి వరకు కలిసి ఉన్న స్నేహితులు విగత జీవులుగా మారడంతో స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు. సమాచారం తెలుసుకున్న చీరాల రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుల వివరాలు సేకరించారు. ముగ్గురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.


మృతుల స్నేహితులతో మాట్లాడి వివరాలు నమోదు చేస్తున్న పోలీసులు


మృతుల స్నేహితులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్

**మరో ఘటనలో వివాహ వేడుకకు వచ్చి...**

వేటపాలెం మండలం వడ్డె సంఘానికి చెందిన మరో ఇద్దరు యువకులు సముద్రంలో గల్లంతయ్యారు. శనివారం వివాహ వేడుకకు వచ్చి ఆదివారం సరదాగా గడిపేందుకు వాడరేవు తీరానికి కుటుంబంతో వచ్చారు. సముద్రంలో స్నానం చేసేందుకు వెళ్లగా వడ్డె సంఘానికి చెందిన గౌతమ్ (15), షారోన్ (18) గల్లంతయ్యారు. షారోన్ సోదరి వివాహం జరగగా అదే ప్రాంతానికి చెందిన గౌతమ్, మరికొందరు ఆదివారం సముద్రతీరానికి వచ్చారు. వీరి ఆచూకీ ఇంకా తెలియలేదు. షారోన్ రాజమండ్రిలో బీటెక్ చదువుతుండగా, గౌతమ్ కొత్తపేట జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

**సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ...**

వాడరేవు సముద్రతీరంలో ఐదుగురు యువకులు మృత్యువాత పడడంతో సమాచారం తెలుసుకున్న ఎస్పీ ఉమామహేశ్వర్ హుటాహుటిన సంఘటన స్థలానికి వచ్చారు. జరిగిన సంఘటనపై ఆరా తీశారు. అలలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా మెరైన్ పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారన్నారు. ఆదివారం జరిగిన సంఘటనలో కూడా మెరైన్ పోలీసులు, స్థానిక గజ ఈతగాళ్లు కొంతమందిని కాపాడారని తెలిపారు. పర్యాటక ప్రాంతంలో ఇటువంటి దురదృష్టకరమైన సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పోలీసులు కాలేజీకి సమాచారం అందించారు. వడ్డె సంఘానికి చెందిన ఇద్దరు యువకుల మృతదేహాలు ఒడ్డుకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు తీరం వెంటే చూస్తూ కన్నీరు కారుస్తున్నారు.

# సెపక్‌తక్రా విజేత.. కృష్ణ

- ద్వితీయ, తృతీయ స్థానాల్లో ప్రకాశం, తూర్పు గోదావరి
- క్రీడాకారులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్ల అందజేత

చీరాల రూరల్:

స్థానిక మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో శనివారం ప్రారంభమైన 29వ రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా జూనియర్ బాలబాలికల పోటీలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. రాష్ట్రంలోని 17 జిల్లాలకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కృష్ణా జిల్లాకు చెందిన బాలబాలికల జట్లు అన్ని విభాగాల్లో రాణించి విజేతలుగా నిలిచి ప్రథమ స్థానాలను కైవసం చేసుకున్నాయి. ప్రకాశం జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. తృతీయ స్థానాన్ని తూర్పు గోదావరి జిల్లా జట్టు గెలుచుకుంది. అలానే బాలుర విభాగంలో కృష్ణా జిల్లా జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, ద్వితీయ స్థానాన్ని ప్రకాశం జిల్లా జట్టు గెలుపొందింది. తృతీయ స్థానంలో అనంతపురం జిల్లా జట్టు నిలిచింది. ఈ పోటీలు ప్రేక్షకుల కరతాళ ధ్వనుల మధ్య ఆసక్తికరంగా.. ఉత్కంఠ భరితంగా జరిగాయి. బరువైన బాలును ఒక్క కాలితో గాలితో ఎగిరికొట్టి అవతలి కోర్టులోకి పంపాల్సి ఉంది. అయినప్పటికీ క్రీడాకారులు ఎంతో పట్టుదలతో గెలుపు కోసం ఆటపై పట్టు సాధిస్తూ ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ఆటను తిలకించేందుకు ప్రేక్షకులు భారీ సంఖ్యలో స్టేడియానికి తరలివచ్చారు. విజేతలుగా నిలిచిన క్రీడా జట్లకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన సెపక్‌తక్రా జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఇస్తర్ల బాబూరావు, ఏపీ బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరంజ్యోతి, నరసరావుపేట ఎంఎం కాలేజెస్ చైర్మన్ ఎంఆర్ రామశేషగిరిరావు, సెపక్‌తక్రా జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఇస్తర్ల సుభాషిణి చేతుల మీదుగా మెమెంటోలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. బాపట్ల జిల్లా సెపక్‌తక్రా జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్ర, జిల్లా అథ్లెటిక్ ట్రాక్, ఫీల్డ్ కోచ్ వి.వనజ, గజవల్లి శ్రీనివాసరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.